# చిన్నప్పుడు

కపిల కాశీపతిరావుగారు, B. A.

౧

"కృష్ణా! కృష్ణా!...గోపాలా!"

"ఓయి!"

"ఇదుగో, ఇల్లారా. పొద్దుణ్ణించీ..."

"అమ్మా! నా పిల్లంగ్రోవేదే?"

"అన్నయ్య దాచేశాడు. వాడితో నువ్వు ఆడుకోవడం లేదుటగా? వెతికి వెదికి విసిగి పోయాడు, పాపం. నీకోసం."

"పిల్లంగ్రోవేదే?"

"ఇస్తానుగానీ, ఎక్కడకి షికారుమళ్లీ? ఆ యేటిగట్టున తిరక్కురా, నాయనా. చెట్లు పుట్టలూ ఎక్కితే యెప్పుడే కాలు విరుగుతుందో. ఏ పురుగు అంట పొడుస్తుందో? బయటికి వెళ్లితే మళ్లీ తిన్నగా ఇంటికొచ్చేదాకా నా ప్రాణం కొట్టుకొంటూనే ఉంటుంది."

"రాము డేడే?"

"అన్నయ్య నాన్నతో పొలం వెళ్లేడు. నువ్వు ఏంచేస్తున్నా వక్కడ? ఇల్లారా. తలదువ్వు కోలేదు నిన్నటినుంచీను. వారం రోజులయింది తలంటుకుని."

"ఎప్పుడూ తలంటే. నాక్కొద్దే."

"దొంగా! దొరికావు. ఎక్కడికి వెడతా వింక?"

"తలదువ్వుకున్నానే, అమ్మా, పొద్దున్న"

"అబద్ధాలు. బండా! దువ్వేదాన్ని నాకు తెలియదురా?"

"నువ్వేనా? ఇంకెవరూ లేరా?"

"అన్నీ పెద్దకబుర్లు. ఎవరున్నార్రా? నీ మేనమామ పెళ్లాం?"

"చూడవే, నిజంగా తలకూడా అంటింది."

"ఎవరూ?"

"రాధ"

"అన్నా! దేశద్రిమ్మరీ. 'సత్రా భోజనం, మఠా నిద్రా' అన్నట్టు వాళ్లపంచలోను వీళ్ల పంచలోను బతుకుతావా దిక్కులేని పిల్లాడిలాగ! పో. అక్కడికే వెళ్లు ఆతలంటిందాన్నే అన్నం కూడా పెట్టమను? నువ్వొస్తావు తినకుండా. తిన్నావా? ఇల్లాచూడు నా కేసీ......"

"ఊఁ"

"పట్టుమని నాలుగురోజులపాటు ఇంటిపట్టున అన్నం తిన్నావూ? నాన్న దగ్గిర అన్నయ్య తిన్నాడు ఈవేళ. నీ కోసం వెన్నపూస దాచాను. రా నాదగ్గిర తిందుగాని. ఎంతసేపయిందో—ఏదీ కడుపేదీ? చూడూ పొట్టఏడుస్తోంది. రా, నాన్నగదూ. కలిపి గోరుముద్దలు పెడతాను. చెప్పినమాట వినమ్మా మరీ—వాళ్లకృష్ణమ్మ ఉట్టి అల్లరికుంక అంటున్నారు అంతాను."

"అమ్మా!"

"ఊఁ"

"రాధ నాకు ఏమవుతుందే?"

"అత్తయ్య."

"ఏమిటే, అమ్మా, అవీ?"

"మిరపకాయలు."

"ఎందుకు అల్లా తిప్పతావు నా చుట్టూ?"

"దేశాలన్నీ తిరిగివచ్చావు గిలగిచ్చకాయ లాగ. ఎవరికళ్లు ఎటువంటివో?"

"రాధకళ్లు బాగుంటాయే, అమ్మా! వాట్ల తోటి నాకళ్లలోకి చూస్తుంది."

"చూశావా, కాస్తగొడ్డైనాలేదు పొయి లోంచి?"

"అయితే రాధచూస్తే అల్లా అవుతుందా?"

"ఏమో, ఎవరికళ్లో నువ్వింక యిల్లుకదలకూ."

"అల్లాఅనకే, అమ్మా, రాధమంచిదే. నిన్న నేను వెళ్లలేదని ఏడ్చిందే. అమ్మ కోప్పడుతుం దంటేను అడిగిరమ్మందే. వెళ్లొద్దుటే, అమ్మా? ఇంకెక్కడికీ వెళ్లనే, రాధగారింటికితప్ప. నిన్న కోపంవచ్చి నేనువెళ్లలేదే. అందుకనీ అన్నం తినలేదుట."

"కోపం ఎందుకు?"

"అదికాదే, చూసిచూసి గబుక్కుని రెండు చేతులు పట్టుకని ముద్దుపెట్టుకుంటుందే. అందు కని"

"చిన్నపిల్లాడవుగదా అనిముద్దూ. నేను పెట్టు కోనూ, ఇల్లారా. ఏమిటి మొహమిమ్మాద?"

"నువ్వుపెట్టుకున్నట్టుకాదే. నువ్వుపెట్టుకుంటే చల్లగా ఉంటుందే. రాధ వేడిగా ఊపిరిసలపదే. ఉక్కిరి బిక్కిరి అవుతుందే. ఎంతసేపటికీ వదల్దు."

"పాపం! ఇంతోటి నల్లబంగారం అంటించు కుందామనీ"

"రాధ నలుపుకాదేమిటమ్మా మరీ?"

"అందుకనే రంగులో రంగుకలిసింది."

"అమ్మా!"

"ఊఁ."

"రాధని పెళ్లిచేసుకోవద్దుటే?"

"ఏడిశావు. నీకంటె పెద్దదిరా. నీకు అత్తయ్య అవుతుంది."

"అవుతే ఏం? నే పెళ్లిచేసుకుంటాను."

"అదికాదు, రేపెళ్లినప్పుడే, అత్తా! అత్తా! ఓ మంచికూతుర్ని కని నాకిమ్మని అడుగు"

"ఇద్దర్నీ చేసుకుంటాగా."

"ఓరి నీఆఘాయిత్యం కూలా! ఎవరిదగ్గిర నేర్చు కున్నావురా ఈ పనికిమాలిన మాటలూ? పుట్టికొన్నీ, పుట్టకకొన్నీ విపరీతపుబుద్ధులు..."

౨

"అత్తా! అత్తా!"

"............"

"రాధా!"

"ఓయి."

"ఎంతపిల్చినా పల్కవేం? ఎక్కడ"

"దొడ్లో; ఇల్లా; పాకలో; అల్లరి చెయ్యకు మెల్లిగా రా."

"ఏం?"

"ఆవు బెదురుతుంది మాట్లాడితే ఎగచేపుతుంది"

"నువ్వో మరి?"

"నాదగ్గిరంటే అలవాటు. అదుగో చూడు. అప్పుడే అడుగు లేస్తోంది అమ్మవారు. అల్లా కూచో కొబ్బరిచెట్టుకింద."

"మాఅమ్మ రోటిమీద కూచోవద్దంది."

"రోళ్లు ఎక్కడుందా? దొంగతనాలు చెయ్యడానికి.........అదుగో అదే వొద్దన్నది. జడ నెప్పిపెడుతోంది. అయ్యో! అయ్యో! పడిపోతాను. పాలొలికిపోతాయి."

"ఇల్లా ఇయ్య, నాపొట్టలో వలకపోస్తాను."

"పూర్తిగా పితకనీ, నీకోసమే. కూచో మరీ ఒక్క నిమిషం......పోదూ, అంతా మోట సరసం. అయింది లేనా కేం. ఆవు బందం తెంపుకుంది ఇంకో గుక్కెడైనా ఇవ్వదు...... ఇదుగో పిల్లంగోరు ఊదు, నుంచుంటుంది."

"అమ్మదొంగా, తెలిసిందిలే నీ వేషం. నువ్వ కూడా వినడానికి కాదూ? ఊరికే అడిగితే పాడనని"

"అయితే నేపాలివ్వను."

"బలవంతంగా తాగుతాను."

"చూద్దాం."

"................................"

"అత్తయ్యోయి! నీకుదణ్ణం, నీకుదణ్ణం, విడిచిపెట్టవూ?... బాబోయి, బాబోయి, ఊపిరి సలపడంలేదు. అత్తా! అత్తోయి!"

"అదేవొద్దన్నది. అత్తేంవిటి? అత్త. రాధ అన రాదూ. శుభ్రమైన పేరుంటే? అత్తట. అత్త."

"రాధోయి! రాధోయి! రాధోయి! రాధోయి!"

"తాగు. ఎల్లా తాగుతావో? పాలు...తప్పించుకుందా మనుకున్నావేం? ఇందుకే ఈ ఎత్తు. తెలిసిందా?"

"ఇంక చెయ్యను విడిచిపెట్టవు?"

"ఏమిస్తావు?"

"చాల్దేంవిటమ్మా? అన్నిమాట్లు పెట్టుకున్నావు, ఇంకెంత సేపు?"

"అయితే ఖయిదువిడుదల లేదు."

"సరే. ఇంకోమాటు. ఏం?"

"కాదు ముఖ్యంగా మూడుమాట్లు."

"ఊం......ఊం—ఒకటే......రెండూ. పెట్టుకో దబ్బుని."

"నాయిష్టంవచ్చినప్పుడు పెట్టుకుంటాను, నీకెందుకు? అది దాచుకుంటాను. మొన్నటిదొకటి—ఇదొకటి రెండుముద్దులు బాకీ. తెలిసిందా?"

"సరే. విడిచిపెట్టు మరి."

"అప్పుడే అయిపోలేదు. ఇంకావుంది."

"అబ్బ! విడిచిపెట్టమంటే. వేడిగా ఎర్రగా కళ్లూ నువ్వూను. బాగున్నావులే."

"అందుకనే చల్లబడడానికే."

"ఈవేళ విడిచిపెట్టవా?"

"వేణువుమీద పాడతావా మరీ?"

"నువ్వల్లాపట్టుకుంటే ఎల్లా పాడతాను?"

"విడిచిపెట్టినతరవాత పాడకపోతే?"


"నీయిష్టంవచ్చినన్ని ముద్దులుపెట్టుకో."

"ఇల్లా కూచునేపాడాలి మరి"

"నీవొళ్లోనా? నన్ను ముట్టుకోకుండాఉంటే!"

"సరే."

... ... ... ... ...



"కృష్ణా! ముద్దుకృష్ణా! మురళీకృష్ణా! ఎవరు నేర్పారు నీ కీసంగీతం? పాట ఇంత బాగుందని నీకు తెలుసా కృష్ణా? మాట్లాడవేం? వినబడడం లేదూ? యక్షగానమా? కిన్నర గానమో యీ యినీ? కృష్ణా, నీ రాధని మింగేస్తోంది నీ పిల్లంగోరు. రాధని పట్టుకోవూ?"

"....................................."

"యమునానదికిమల్లె నాశరీరం వరదలై పారుతోంది, కృష్ణా కట్టెయ్యవూ? ఈ స్రవంతిని నీ చేతుల్లో...కృష్ణా...చూడు. నిజంగా. ఇప్పుడు వేడిగాలేను."

"..............................."

అదేమిటి, రాధా, అల్లా ఏడుస్తావెందుకు పిచ్చిదానిలాగ, కళ్లమ్మట నీళ్లు చూసుకో—ఎందుకు అల్లా చూస్తావు?"

"కాదుకృష్ణా, ఏడుపుకాదు."

"అదుగో కళ్లమ్మట నీళ్లూ నువ్వావ ఏడవడంలేదూ? ఏడవకు, రాధా. నాక్కూడా ఏడుపొస్తుంది."

"ఎందుకు?"

"నువ్వేడుస్తే నాకూవొస్తుంది."

"నేను నవ్వితే"

"నాకునూ."

"నిజంగా? కృష్ణా! నిజంగా? నేనేడిస్తే నీ కేడుపొస్తుందా? అయితే నేనంటే యిష్టమేనా నీకు?

"ఊఁ"

"మరి నేనల్లాచేస్తే కేకలేస్తా వెందుకు?"

"ఊరికేనే. మరినువుచేస్తున్నావుగా నే కేకలేసినా? కేకలేస్తే కోపమా? బాగుండదూ?"

"అదికాదు. నీకిష్టంలేదేమో అని"

"ఎందుకు రాధా అల్లా కళ్లమ్మటనీళ్లు? కోపం వచ్చిందా ఇందాకా కేకలేశానని?"

"కాదు."

"మరి ఎందుకు?"

"నువ్వు వెళ్లిపోతావని"

"ఏడవకు రాధా. నేవెళ్లను. ఎప్పుడూ ఇక్కడే ఉంటాను."

"మీ మామయ్య రమ్మన్నాట్టగా మధురలో ఉండటానికి? అక్కడ రాజభవనంలో ఉండి నన్ను మర్చిపోతావేమో అని"

"రోజూ ఇక్కడి కొస్తాను రాధా. ఏరుదాటి చెప్పకుండా వస్తాను. ఏం? ఏడవ కింక. పోనీ నువ్వుకూడా రా ఎక్కడి కెడితే అక్కడికి"

"ఎల్లాగా?"

"పెద్దాణ్ని అయాక నిన్ను పెళ్లి చేసుకుంటాగా.

"అందుకనే నువ్వు పెద్దవాడి వయిపోతావని"

"అయితేయేం? నిన్ను పెళ్లి చేసుకుంటాగా? అప్పుడు మనిద్దరం ఉండొచ్చు ఎంచక్కా ఏం?"

"ఒద్దు. నువ్వు ఇల్లాగే ఉండాలి, కృష్ణా. ఎప్పుడూ ఇంతే. పాలు తాగుతూ, ఇక్కడే, నీ మురళీ నువ్వు, ఇదే మోస్తరుగా ఉండాలి. పెద్దవాళ్లయితే ఏం బాగుంటారు? పెద్దాళ్లయితే అసహ్యంగా ఉంటారు. కృష్ణా! అదేమిటో అంతా పెద్దాళ్లని పెళ్లి చేసుకుంటారు? నా చిన్నికృష్ణుణ్ణి చేసుకోకూడదూ, కృష్ణా! ముద్దుకృష్ణా! రాధాకృష్ణా!"

"మరెల్లాగ, అల్లాగే ఉన్నాననుకో. నీ కెప్పుడూ ఇల్లాగే కనబడతాను."

"కృష్ణా!"

"ఎందుకల్లా చూస్తావు?"

"తనివితీరదు, కృష్ణా! నీకు నేను బాగుండను?"

"ఏం?"

"మరినాకేసి నువ్వల్లా చూడవేం?"

"ఎప్పుడునువ్వే చూస్తావుగా. నన్ను చూడనివ్వందే."

"చూసి ఏంచేస్తాను?"

"గట్టిగాపట్టుకుని ఊపిరిసలపకుండా ముద్దుపెట్టుకుంటావు. వేడిగా ఊపిరి నువ్వూను"

"నువుకూడా అల్లాచెయ్యి. ఇంక నిన్నుకూడా చూడనిస్తాను. చూడు, కృష్ణా! నాకేసి, నీయిష్టం. నీకిచ్చేశాను నన్ను. రాధ నీదే. ఏంచేసినాసరే దీనితోటి...ఇప్పుడే కావాలా?"

"ఊఁ."

---